నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ చందమామా ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు నాచారం ఐడీఏ రోడ్డు నెంబర్ 09,10లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలి పారు. 11 కేవీ భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐడీఏ రోడ్డు నెంబర్ 8, నాచారం మెయిన్ రోడ్డు, సింగం చెరువు తండా, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రసాద్ ఆసుపత్రి లైన్ ఏరియా, 11 కేవీ అవురా ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు రోడ్డు నెంబర్6, మల్లాపూర్ నుంచి నాచారం మెయిన్‌రోడ్డు ఐడీఏ నాచారం, 11 కేవీ స్టాలిన్ టైర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఐడీఏ నాచారం రోడ్డు నెంబర్ 5,6,8 శాంతి బయిలర్స్ ఆన లాజికల్ లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ న్యూమిర్జాలగూడ దర్గా సమీపంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు. ఏఈ దివ్యజ్యోతి, బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించకుంటే లైసెన్స్ రద్దు చేస్తాం



మద్యం షాపు వద్ద జీహెచ్ఎంసీ అధికారులు

రామంతాపూర్: ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాలతో పాటు మద్యం దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించకపోతే వాటి లైసెన్సులు రద్దు చేస్తామని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు హెచ్చరించారు. రామంతాపూర్ టీవీ కాలనీ బైపాస్‌రోడ్డులోని కనకదుర్గ వైన్ షాప్ పక్కన ఉన్న తినుబండారాల షాపుల వద్ద చెత్త, చెదారం అపరిశుభ్రత వాతావరణం ఉంటుందని స్థానికులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. శనివారం ఉప్పల్ డీసీ ఆంజనేయులు ఆధ్వర్యంలో సిబ్బంది వైన్‌షాపు, తినుబండారాల దుకాణాలపై దాడులు నిర్వహించి రూ.10 వేల జరిమానాతో పాటు కొన్నింటిని సీజ్ చేశారు.

వైన్స్ షాపునకు జరిమానా..

ఉప్పల్: వ్యాపార కూడళ్లు, వైన్‌షాపులు తదితర వ్యాపార సముదాయాల్లో పరిశుభ్రత పాటించకుంటే భారీగా జరిమానా విధిస్తామని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు హెచ్చరించారు. ఈ మేరకు పరిశుభ్రత పాటించని రామంతాపూర్‌లోని ఓ వైన్స్‌షాపును శనివారం జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేయడంతో పాటు రూ.10,000 జరిమానా విధించారు. స్వచ్ఛ ఉప్పల్ సర్కిల్‌గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమంగా ఇసుక నిల్వ చేస్తే చర్యలు తప్పవు



కాప్రా: అక్రమంగా ఇసుక నిల్వచేస్తే చర్యలు తప్పవని కాప్రా మండలం తహసీల్దార్ సుచరిత హెచ్చరించారు. వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఇసుకను తీసుకొచ్చి చక్రీపురం పరిధిలో అక్రమంగా నిల్వ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.ఈ అక్రమ నిల్వలు గుర్తించిన పోలీసులు 8 మందిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. అక్రమంగా ఇసుక నిల్వ చేసిన 8 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

ట్రాఫిక్‌రూల్స్‌పై బైక్ ర్యాలీ

సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే నిశ్చితంగా, నిర్భయంగా రాకపోకలు సాధ్యమవుతాయని ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనను పెంపొందించేందుకు నగర ట్రాఫిక్ పోలీస్ విభాగంతో కలిసి కొంపల్లిలోని ర్యాన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ 10 కిలోమీటర్ల మేర సాగగా.. పెద్ద సంఖ్యలో యువత బైక్స్‌తో పాల్గొన్నారు. అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) వెంకటరెడ్డి హాజరై నిబంధనలపై వివరించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

కుషాయిగూడ: లంబాడీల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ 286వ జయంతి వేడుకలను శనివారం చర్లపల్లి, మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్లలో ఘనంగా నిర్వహించారు. కృష్ణారెడ్డినగర్‌లో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించగా.. చక్రీపురం చౌరస్తాలో ఆల్ ఇండియా బంజార సేవా సమితి మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, హనుమంతు, శ్రీనివాస్, ఇస్లావత్ హరినాయక్‌లు పాల్గొని సంత్ సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌బీకాలనీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాంప్రదీప్, డాక్టర్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

అల్వాల్: వెంకటాపురం డివిజన్ కానాజీగూడలో శనివారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సబితా అనిల్‌కిషోర్ హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. మున్యానాయక్, రాజునాయక్, గోపాల్‌నాయక్, బీఆర్ఎస్ నేతలు మోసిన్, జందర్, తాజుద్దీన్, రాజు, సురేష్, జనార్దన్, సురేష్‌రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: బంజారాల అభ్యున్నతి కోసం నిరంతరం పాటు పడిన మహనీయులు సంత్ సేవాలాల్ అని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం సంత్ సేవాలాల్ 286వ జయంతి సందర్భంగా హబ్సిగూడలో నిర్వహించి ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.


హబ్సిగూడలో రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

చిలుకానగర్‌లో..

తుల్జా భవాని లంబాడి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొర్య కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమానికి చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ హాజరై స్వామివారికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.


కృష్ణారెడ్డినగర్‌లో కార్పొరేటర్ శ్రీదేవి, బీఆర్ఎస్ నేత సోమశేఖర్‌రెడ్డి


హెచ్‌బీకాలనీలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాంప్రదీప్


చక్రీపురం చౌరస్తాలో శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో..


కానాజీగూడలో..


చిలుకానగర్ చౌరస్తాలో కార్పొరేటర్ బన్నాల గీత

శ్రీకృష్ణ ఆలయంలో విద్యా హయగ్రీవ హోమం

బోడుప్పల్: రవీందర్‌నగర్ కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం విద్యా హయగ్రీవ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాకాలం, ద్వారతోరణ పూజ, అగ్నిముఖం, నిత్యబలి, నివేదన, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, చతుస్థానార్చన ఎదురు సన్నాహం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. చిన్నారుల కూచిపూడి ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పన్నాల కృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ అంజిపటేల్, భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి


నృత్య ప్రదర్శనతో చిన్నారులు

పేకాట నిందితుల అరెస్టు

కుషాయిగూడ: గుట్టుగా పేకాడుతున్న వ్యక్తులను మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేసి కుషాయిగూడ పోలీసులకు అప్పగించారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాడుతున్నారన్న సమాచారంతో మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.33,210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్‌ఓటీ పోలీసుల ఫిర్యాదు మేరకు గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో నైపుణ్యం మెరుగు


సెయింట్ జేవియర్ కాన్వెంట్ స్కూల్‌లో..

అల్వాల్: అల్వాల్ వెంకటాపురంలోని సెయింట్ జేవియర్ కాన్వెంట్ హైస్కూల్‌లో విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. స్కూల్ కరెస్పాండెంట్ మాధవిరెడ్డి మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. ప్రిన్సిపాల్ మేరీ సలూజ, ఇన్‌చార్జ్ సువర్ణ, వీణ, లక్ష్మి, స్థానిక నేతలు యాదగిరిగౌడ్, ప్రేమ్‌కుమార్, సాజిద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


తార్‌సిలా

మల్కాజిగిరి: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాణీనగర్ శ్రీసాయి నిలయం అపార్టుమెంట్‌లో నివాసం ఉండే తార్‌సిలా(67) అపార్ట్‌మెంట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అపార్ట్‌మెంట్ నిర్వహణకు సంబంధించిన డబ్బులు దుర్వినియోగం అయినట్లుగా గుర్తించి ఆమెను ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులతో అపార్ట్‌మెంట్‌వాసుల నుంచి కూడా అప్పులు చేసినట్లుగా చెప్పింది. ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన


ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. నృత్య సంపద, నాట్యం సంస్థ గురువులు తోగర్వేడు వరుణ్ శర్మ, సురేఖ సాయిశిష్యబృందంచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మూషికవాహన, మరకత మణిమయ, మహేశ్వరి, భామాకలాపం, దేవదేవం, బ్రహ్మాంజలి తదితర అంశాలను కళాకారులు హారతి, అక్షర, శంకర, ప్రీతి, నవనీత, అమృత, శ్రీరమ్య, శ్రీనిధి, ఆధ్యశ్రీ తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య ఘర్షణ


నెహ్రూనగర్‌లో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కుషాయిగూడ: మల్లాపూర్ డివిజన్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మాట మాట పెరిగి తోపులాట వరకు దారితీసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. మల్లాపూర్ డివిజన్, నెహ్రూనగర్‌లో సీసీరోడ్ల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి రూ.కోటి నిధులను మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిగౌడ్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆ సమయంలో ఇరు పార్టీల నేతలు తమ నాయకులపై పరస్పర విమర్శలు చేసుకోవడంతో గొడవకు దారితీసింది. కాంగ్రెస్ నేత సాయిగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, సీఎం, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటుగా మహిళ కార్యకర్తలని చూడకుండా బీఆర్ఎస్ నేతలు ఘర్షణకు దిగారని ఆరోపించారు. దీనిపై చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. బీఆర్ఎస్ నేత బాషీత్‌ఖాన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, కార్పొరేటర్లు చేసిందేమీ లేదని, కాంగ్రెస్ నేతలే రెచ్చగొట్టేలా మాట్లాడారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే నెహ్రూనగర్ సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వాస్తవాలు తెలియకుండా మాట్లాడటం సరికాదన్నారు. మాపై చేసే ఆరోపణల్లో వాస్తవం లేదని, తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై చర్లపల్లి ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా గొడవ జరిగింది వాస్తవమేనన్నారు. బీఆర్ఎస్ నేతలు తన గొంతుపై చెయ్యివేసి నెట్టేయడంతో పాటుగా అవమానపరిచేలా వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు బాషీత్, ప్రవీణ్, వినయ్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ న్యూ మిర్జాలగూడ రాజా శ్రీనివాసనగర్‌లోని శ్రీసిద్ధివినాయక స్వామి, అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి సప్తదశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం కాశీవిశ్వేశ్వరస్వామికి రుద్రాభిషేకం, చండీహోమం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

కార్పొరేటర్ పర్యటన


స్థానికులతో కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: భ్రమరాంబికానగర్‌లో సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. శనివారం కాలనీలో పర్యటించిన ఆయనకు సమస్యలను వివరించారు. పార్కులను శుభ్రంగా ఉంచుకోవాలని హార్టికల్చర్ విభాగాన్ని ఆయుర్వేద మొక్కలు పంపిణీ చేయాలని కోరతామన్నారు. కాలనీలో గ్రీన్‌వేస్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించామన్నారు. వెంకటేష్, రాజు, నర్సింహ, రవి, రమేష్ తదితరులున్నారు.

మజీద్ సమస్యలు పరిష్కరిస్తా



మల్కాజిగిరి: బీజేఆర్‌నగర్ మజీద్ వద్ద సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం మజీద్ కమిటీ సభ్యుల కోరిక మేరకు పర్యటించారు. మజీద్‌కు కొత్త మీటర్లు కావాలని కోరగా.. సంబంధిత ఏడీఈ చంద్రశేఖర్‌ను చర్యలు తీసుకోవాలని కోరారు. మజీద్ ముందు యూజీడీ, రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరడంతో తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. బాబు, సత్యనారాయణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

కాప్రా/ఉప్పల్ : ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని జెడ్సీ హేమంత్ కేశవ పాటిల్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. శనివారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పలు కాలనీలు రోడ్లు, ఓపెన్ జిమ్స్, కమ్యూనిటీహాల్స్‌కు సంబంధించిన నిధులను త్వరగా మంజూరు చేయాలన్నారు. కొన్ని కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించడంతో రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని, తక్షణమే ఆయా కాలనీల్లో నూతన సీసీరోడ్లు నిర్మించాలని చెప్పారు. సానుకూలంగా స్పందించిన జెడ్సీ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ రమేష్

మల్లాపూర్: ఆశావర్కర్లు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి వారికి రూ.18 వేల వేతనం ఇవ్వాలని దళిత జన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ రమేష్ డిమాండ్ చేశారు. శనివారం మల్లాపూర్‌లో దళిత జనకార్మిక విభాగం ఆధ్వర్యంలో ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొజ్జ రమేష్ మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలన్నారు. రూ.18 వేల వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి పర్మనెంట్ చేయాలన్నారు. ఒక్కొక్కరికి భీమా పథకం కింద రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆశావర్కర్ల సమస్యలను రాష్ట్రప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలన్నారు.

లిటిల్ ఫ్లవర్ కళాశాలలో 2 కే రన్

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం 2 కే రన్ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ అరుణ్ ప్రకాష్, ఉప్పల్ టాఫిక్ ఎస్సై నాగభూషణంతో కలిసి ప్రారంభించారు. ఈ రన్ ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల నుంచి స్టేడియం మీదుగా డీఎస్ఎల్‌మాల్ తిరిగి కళాశాలకు చేరుకుంది. అనంతరం అరుణ్ ప్రకాష్ మాట్లాడుతూ.. ఇంటర్నెట్ వచ్చిన తర్వాత మన జీవన శైలి మారిందని, మన జీవితాలను మార్చిన ఇంటర్నెట్‌ను మంచికే వాడాలని, చెడుకు వాడకూడదని సూచించారు. డైరెక్టర్ జాన్ కలరాకల్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రన్‌ను ప్రారంభిస్తున్న అరుణ్ ప్రకాష్ , ట్రాఫిక్ ఎస్సై నాగభూషణం

లిటిల్ ఫ్లవర్ స్కూల్ స్నాతకోత్సవం..

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ ప్లే స్కూల్ విద్యార్థుల స్నాతకోత్సవం శనివారం పాఠశాల ప్రాంగణంలో చిన్నారుల కేరింతలతో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ మాలతి హాజరై విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు. నేటి బాలలే రేపటి పౌరులని అందరికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోసెఫ్ రెడ్డి, కరస్పాండెంట్ బ్రదర్ అరుణ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


స్నాతకోత్సవంలో హైదరాబాద్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ మాలతి

గ్రీన్‌ఫీల్డ్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక షురూ

అల్వాల్: కానాజీగూడలోని గ్రీన్‌ఫీల్డ్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. చాలా కాలంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయి కోర్టు ఆదేశాల మేరకు ఈనెల 9 నుంచి ఎన్నికల ప్రకియ ప్రారంభమైంది. శనివారం కాలనీలోని అసోసియేషన్ కార్యాలయం వద్ద నామినేషన్ల ప్రక్రియ పూర్తైంది. మొత్తం 694 మంది సభ్యులు ఉండగా.. వీరిలో 19 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఉపసంహరణ అనంతరం మిగిలిన వారిలో పోటీ ఉంటే ఎన్నిక అనివార్యం అవుతుంది. కాగా అధ్యక్ష స్థానానికి ఒక్కరే నామినేషన్ వేయడం గమనార్హం. దీంతో అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం కావొచ్చని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా గ్రీన్‌ఫీల్డ్స్ కాలనీ గత కొన్నేళ్లుగా వివాదాస్పదంగా మారింది. స్థల యజమానులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో అసోసియేషన్ ఎన్నిక ప్రధానంగా మారింది.


నామినేషన్లు దాఖలు చేస్తున్న అభ్యర్థులు

డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

మేడ్చల్‌రూరల్: డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సీతారాం అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో యాంటి డ్రగ్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగించడం వల్ల యువత మత్తుకు బానిస అవుతున్నారని, దీంతో చదువుపై శ్రద్ధ తగ్గిపోయి సంఘ వ్యతిరేక శక్తులుగా మారతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల విద్య ఎంతో విలువైందని, యువత చెడు దారిన వెళ్లకూడదని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడిన అనంతరం విద్యార్థులతో పోలీసులు డ్రగ్స్ నివారణ ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు. యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ సుబ్బరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ రత్నకుమారి, ఏవో రాజేష్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కో– ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలీసులు, విద్యార్థులు